క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీఎంఈ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శివప్రసాద్

జగిత్యాల: జగిత్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ శివరాంప్రసాద్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం జగిత్యాలకు వచ్చి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాలఅభివృద్ధిపై చర్చించారు. ఆయన వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఖాద్రి, సూపరింటెండెంట్ రాములు, వైద్యులున్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జగిత్యాల: మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు సౌందర్య అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల ఆవరణలో ప్రభుత్వ పాఠశాల ఉందని, పాఠశాల విద్యార్థులను కళాశాలలో ఉన్న తాగునీరు, మరుగుదొడ్లు వాడుకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ చేసి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, వినోద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీశ్

పెగడపల్లి: ట్రాఫిక్,రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సతీశ్ సూచించారు. మండలంలోని నంచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియంతృత్వ విధానం వీడాలి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ నియంతృత్వ విధానం వీడాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా అధికారిక కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిని అకారణంగా దుర్భాషలాడటం, ఆయనపై దాడికి దిగడం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ పాలనకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజాపాలనలో సాటి ప్రజాప్రతినిధులను అవమానిస్తూ దాడులకు దిగుతున్న కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకుల వైఖరి గర్హనీయమన్నారు.

జీపీ నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరిపించాలి

బుగ్గారం: బుగ్గారం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరిపించాలని గ్రామ వీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సర్పంచ్ మూల సుమలత,ఆమె భర్త శ్రీనివాస్‌గౌడ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. బాధ్యులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ పంచాయతీలకు అధికారుల కేటాయింపు

పెగడపల్లి: గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి 1న ముగియనుంది. ఈ మేరకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీవో కృపాకర్ తెలిపారు.

కథలాపూర్: మండలంలోని 19 గ్రామపంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు మంగళవారం ఉత్తర్వులు అందుకున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు వెళ్లి కార్యదర్శుల వద్ద సమాచారం సేకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో వాగ్దానం మేరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నాయకుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద మల్లాపూర్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, చెరుకు రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ న్యావనంది లింబారెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మెట్‌పల్లి: ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంపై చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, బద్దం



మెట్‌పల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శ్రీనివాస్‌రెడ్డి, గురిజెల రాజిరెడ్డి, గొల్లపల్లి రామాగౌడ్, గంగారెడ్డి, లింబారెడ్డి, నవీన్‌పాల్గొన్నారు.

రాయికల్: నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కమిటీ వేయడంపై పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. రైతు బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపి రాజిరెడ్డి, ఎద్దండి భూంరెడ్డి, ఆదిరెడ్డి, గన్నవరం ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాకేశ్, మ్యాకల రమేశ్, సుదీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి: అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లిలో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, అయితిపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనం, నందగిరిలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తేవాలని వాటిని సాధ్యమైనంత మేరకు పరిష్కార మయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో సర్పంచులు ఇస్లావత్ రవినాయక్, కొండయ్య, రాకేశ్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ అంజయ్య, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, పీఆర్ ఏఈ షంషేర్ అలీ, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీటీం నిరంతర కృషి

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తోందని షీటీం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాలలో షీం టీం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలపై వెంటనే బాధితులు పోలీసులను సంప్రదించాలని, మహిళల రక్షణకు, వారిపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు షీటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీం నంబరు 8712670783కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, పూజిత పాల్గొన్నారు.



విద్యార్థుల రక్షణపై అవగాహన కల్పిస్తున్న సీఐ

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు రక్త పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఎనిమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తం తక్కువ ఉన్న విద్యార్థులకు వైద్య సిబ్బంది సూచనలను చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ అధికారి డాక్టర్ మౌనిక, ఫార్మాసిస్ట్ మాధవి, ధేఎస్ఎం సోని, ప్రిన్సిపాల్ దాసరి నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణ వేడుకలు

కథలాపూర్: స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణ దినోత్సవంను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీడీవో జనార్ధన్, ఈసీ లక్ష్మయ్య, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు

ఇబ్రహీంపట్నం: అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోనివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఏపీవో వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పైరుకు పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: యాసంగిలో వరిపైర్లకు సోకే పురుగు నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. మండలంలో మంగళవారం వరి పొలాలను పరిశీలించారు. చీడపీడల నివారణకు మండల వ్యవసాయ అధికారులను రైతులు సంప్రదించి వెంటనే చర్యలు చేపట్టాలని రైతులను కోరారు. ఏఈవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

'ఎస్సై బెదిరింపు ఆరోపణలు అవాస్తవం'

మెట్‌పల్లి: ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్ బెదిరింపులకు గురి చేస్తున్నారని సామ లక్ష్మారెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన గంగోని రాజన్న మంగళవారం తెలిపారు. గ్రామంలో తాము కొనుగోలు చేసిన భూమిని లక్ష్మారెడ్డి అక్రమంగా పట్టా మార్పిడి చేయించుకున్నారన్నారు. దీనిపై తాను ఫిర్యాదు చేయగా, ఎస్సై లక్ష్మారెడ్డిని పిలిపించి భూమికి సంబంధించిన పత్రాలను అడిగితే దురుసుగా ప్రవర్తించారన్నారు. ఎస్సై బెదిరించారనడంలో ఎంతమాత్రం నిజం లేదని, ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు బోరుబావులు మంజూరు

కథలాపూర్: మండలం సిరికొండలో రజక సంఘం, మడెలయ్య ఆలయం వద్ద బోరుబావుల ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ నాగం భూమయ్య తెలిపారు. ప్రొసీడింగ్ కాపీలను మంగళవారం రజక సంఘం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాండ్ల వీణ, సింగిల్‌విండో చైర్మన్ చుక్క దేవరాజం, నాయకులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

రాయికల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కోరం లేనందునా వాయిదా వేసినట్లు కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు.



విద్యార్థుల జోష్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కేజీఆర్ స్కూల్ 33వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కూచిపూడి, భరతనాట్యంతో పాటు, ఫోక్ డ్యాన్స్‌ల్లో పాల్గొని సందడి చేశారు. అలాగే పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేజీఆర్ కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్దన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమ, ప్రిన్సిపాల్ సనత్, వైస్ ప్రిన్సిపల్ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటా, పాటలు అలరించాయి. కరస్పాండెంట్ నలువాల శేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్వేత, రాజేందర్,పాల్గొన్నారు.



మహనీయులను స్మరించుకోవాలి

జగిత్యాలక్రైం: స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని అదనపు ఎస్పీలు (ఏఆర్) భీంరావు, జనార్దన్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏవో అమర్‌నాథ్, ఆర్ఐలు జానిమియా, రామకృష్ణ, వేణు, ఆర్ఎస్సైలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముని సేవలు మరవలేనివి

జగిత్యాల: మహాత్మగాంధీ కుష్ఠువ్యాధిగ్రస్తులకు చేసిన సేవలను మరవలేనివని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మిషన్ కాంపౌండ్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో గాంధీ వర్ధంతి రోజున ఏ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం జరుపుకుంటామన్నారు. కుష్ఠుకు మందులు ప్రతి ఆరోగ్య కేంద్రంలో లభిస్తాయన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, స్వాతి, సంతోష్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం పెంచాలి

జగిత్యాల: కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుతారి రాములు, ఎండీ.ముఖ్రం అన్నారు. వచ్చే నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెకు సంబంధించిన నోటీసును మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందించారు. వెన్న మహేశ్, లక్ష్మీరాజం, జమున, పద్మక్క, పరమేశ్వరి పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ధర్మపురి: ధర్మపురి సొసైటీ సంఘంసభ్యుడు జనికె రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబానికి మంజూరైన రూ. 2 లక్షల చెక్కును డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మృతుడి భార్య సునీతకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మి, సీఈవో రాజేశ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేడిపల్లి: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన, జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేడిపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుడ్ల మనోహర్ ఉత్తమ ప్రతిభ చాటి, జిల్లా స్థాయి మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జెడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, సర్పంచ్ సంపత్ కుమార్, ఎంపీపీ ఉమాదేవి, రాజరత్నాకర్ రావు తదితరులు అభినందనలు తెలియజేశారు

కోరుట్ల: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కోట పూజిత ప్రథమ స్థానం సాధించింది. అండర్ 10 విభాగంలో ప్రతిభ కనబర్చి భద్రాద్రి కొత్త గూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పూజితను మంగళవారం పలువురు అభినందించారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ స్కూల్‌లో సెకెండ్ క్లాస్ చదువుతున్న విద్యార్థిని తన్విక అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించింది. మంగళవారం మెట్‌పల్లిలో జరిగిన డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ విభాగంలో అథ్లెటిక్స్‌లో అండర్- 8లో 300 మీటర్ల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

జగిత్యాలలోని ఎస్ఎస్వీ కళాశాలలో చదువుతున్న విద్యార్థి మాధవ్ అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జగిత్యాల నుంచి అయోధ్య వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. రామున్ని దర్శించుకుని అటు నుంచి కాశీయాత్ర చేసి కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకుని జగిత్యాలకు వచ్చాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణ అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో వచ్చే ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో నిర్వహించే 2 వ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ అన్నారు. మండలంలోని సాతారం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీహరి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు గొడుగు రఘుపతి యాదవ్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు లావుడ్య రాజయ్య, మండల బాధ్యులు పాల్గొన్నారు.

డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక డ్రైవ్

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి, పోతారం, సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సారంగాపూర్ ఆధ్వర్యంలో మంగళవారం డిపాజిట్ల సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ దత్తుమూర్తి, సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

మెట్‌పల్లి: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వీటిని జెండా ఊపి డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైన దృష్టి సారించాలన్నారు. కాగా అండర్-8,10,12,14 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు 980 విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాల, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, డాక్టర్ మారుతీరెడ్డి, లింగంపల్లి సంజీవ్, మహర్షి, గంగాధర్ తదితరులున్నారు.



ప్రశంసాపత్రాలతో విజేతలు

గాంధీజీకి ఘన నివాళి

రాయికల్: గాంధీజీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో నాయకులు పడిగెల రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దివాకర్, షాకీర్, సింగని రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం ఎంపీపీ, అధికారులు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీష్, వైస్ ఎంపీపీ గొరు నాగేష్, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎంఎ.సత్తార్, ఎంపీటీసీలు, మండల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జాతిపితకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఏలేటి నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు పల్లపు బాపురాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, సిబ్బంది, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో మంగళవారం గాంధీజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు నివాళి అర్పించారు.



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న అధికారులు



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కోరుట్ల: పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం కార్మికులను కలిసి మాట్లాడారు. తమకు గత 3 నెలలుగా జీతాలు అందటం లేదని కార్మికులు నర్సింగరావుకు తెలిపారు. కార్మికుల సమస్యలను పుపాలక మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు అంతడుపుల నర్సయ్య అమ్మమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మృతదేహం వద్ద నివాళి అర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, నాయకులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న నర్సింగరావు

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా ప్రవీణ్

కోరుట్ల: కోరుట్ల పట్టణ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా గుర్రాల ప్రవీణ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నియామక పత్రాన్ని ప్రవీణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాధర్ గౌడ్, మండల అధ్యక్షుడు కొంతం రాజం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాజేశ్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా పోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దొబ్బాల వేణు, అత్తినేని అఖిల్, అబ్దుల్ అమన్, సంయుక్త కార్యదర్శిగా తిరుమల మనోజ్, కోశాధికారిగా గణేశ్, గొడ్డండ్ల చిరంజీవి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నల్లగొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఈవోగా అర్చన

కొండగట్టు: కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీ నరసింహ ఆలయ ఈవోగా అనుష మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు నల్లగొండకు డిప్యూటేషన్‌పై వచ్చిన మారుతి ,ఆగ్రహారం ఆలయానికి ఈవోగా వెళ్లారు. ఈ సందర్భంగా వారిని అధికారులు, అర్చకులు శాలువతో సత్కరించారు.

సంతకాలపై విచారణ

రాయికల్: మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ ఎంపీపీ గండ్ర రమాదేవిపై కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసం తీర్మానం అందజేశారు. అవిశ్వాస తీర్మాన కాపీలో పెట్టిన సంతకాలపై సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో పెట్టిన సంతకాలు ఒకే విధంగా ఉన్నాయా లేదా అన్న అంశంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు.

గ్రామాల అభివృద్దే ప్రధాన ఎజెండా

వెల్గటూర్ : గ్రామాల అభివృద్దే ప్రధాన ఎజెండాగా పనిచేశారని ఎంపీడీవో ఆకుల సంజీవరావు అన్నారు. బీపీడీపీ 2024-25 నిధుల గురించి వెలగటూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్‌సీ టైడ్ గ్రాంట్ కింద 21.51 లక్షలు, అన్ టైడ్ గ్రాంట్ కింద 12.91 లక్షలకు గ్రామ పంచాయతీల వారీగా ప్రణాళిక తయారుచేయడం గురించి సమావేశంలో చర్చించారు. గ్రామ స్థాయిలో అవసరమైన పనులను ప్రతిపాదనలు చేయాల్సిందిగా సర్పంచులు, ఎంపీటీసీలను కోరారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్నందునా వారిని ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'వైస్ చైర్మన్ రేసులో లేను'

రాయికల్: మున్సిపల్ వైస్ చైర్మన్ రేసులో తాను లేనని తురగ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వైస్ చైర్మన్ రేసులో ఉన్నట్లు వస్తున్నవి పుకార్లేనని తెలిపారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో బిల్లులు రాకపోవడంతో అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు కౌన్సిలర్ మహేశ్‌గౌడ్ తెలిపారు. తాము ఏలాంటి టూర్లకు వెళ్లడం లేదన్నారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన పొడేటి పాల్‌ను కులం పేరుతో దూషించిన కోరుట్లకు చెందిన టి.రాజేంద్రప్రసాద్, నిమ్మ గంగరాజంపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పొడేటి పాల్ అనే వ్యక్తి తన సొంత వ్యవసాయ భూమిలో సోయాబిన్ పంట సాగు చేశారు. ఈ పంటను రాజేంద్రప్రసాద్, గంగరాజం ధ్వంసం చేశారని, పంటను ఎందుకు ధ్వంసం చేశారని అడిగితే కులం పేరుతో దూషించారని బాధితుడు పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాల్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో భీమయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఆర్సీ కార్యాలయాల్లో పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం నూతన సంవత్సర డైరీని వారికి అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి జక్కుల నవీన్‌కుమార్, రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి నర్సింగరావు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నియంత్రణపై అవగాహన పెంపొందించుకోవాలి

మల్యాల: కుష్ఠువ్యాధి నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి మౌనిక అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోగులకు అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధిని సకాలంలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో హిరియా నాయక్, దేవీసింగ్,రమేశ్, సునంద, మంజుల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో మంగళవారం అవగాహన కల్పిస్తూ, వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

రాయికల్: పట్టణంలోని జగిత్యాల రోడ్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణ పనులను మంగళవారం కమిషనర్ సంతోష్‌కుమార్ జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ నియమ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మేనేజర్ వెంకట్, జేఏలు హరీశ్, రజాక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.